దింపుడు కళ్లం ఆశలతో చంద్రబాబు

- జగనన్నపై ఎల్లో మీడియా విష ప్రచారం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆరోపణ
- 12వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు


జగనన్న స్టిక్కర్‌ను అంటిస్తున్న మహిళ, పక్కన ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

తిరుపతి మంగళం : టీడీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నా చంద్రబాబు మాత్రం దింపుడు కళ్లం ఆశలతో అధికారంలోకి వస్తామని కలలు కంటున్నాడని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం మేయర్ శిరీష, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కె.బాబుతో కలిసి 12వ డివిజన్‌లోని జైభీమ్‌కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పరిపాలనపై వారి అభిప్రాయాలు సేకరించారు. వారి అనుమతితో సీఎం జగన్‌కు మిస్డ్‌కాల్ ఇప్పించి ఇంటికి జగనన్న స్టిక్కర్ అంటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని తెలిపారు. ఎలాగైనా చంద్రబాబును అధికారంలోకి తేవాలన్న దురాలోచనతో ఎల్లో మీడియా జగనన్నపై సైనేడ్ కంటే విషపూరిత ప్రచారం చేస్తున్నాయన్నారు. టీడీపీ ఎప్పుడో చచ్చిపోయిందని, చంద్రబాబు శ్మశానం ముందు శవాన్ని పెట్టుకుని పైకి లేయ్ అంటూ దింపుడు కళ్లం ఆశలను పెట్టుకున్నాడన్నారు. రాష్ట్రంలో 87 శాతం ప్రజలకు జగనన్న అనేక రూపాల్లో సంక్షేమ పథకాలను అందించి వారి గుండెల్లో నిలిచిపోయారన్నారు. అందుకే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలు ఇంతగా మమ్మల్ని ఆదరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ అధ్యక్షులు ఉదయగిరి రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నల్లాని బాబు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎస్‌కె. జానీ, మురళీ, వినోద్, చరణ్, హరి పాల్గొన్నారు.

పబ్లిసిటీ కోసమే జనసేన నీచరాజకీయాలు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలు తమను ఎంతో ఆదరించి జగనన్నే మా భవిష్యత్తు అని జగనన్న స్టిక్కర్లను స్వయంగా వారి ఇంటికి అంటించుకుంటున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆ స్టిక్కర్లపైన మాకు నమ్మకం లేదు జగన్.. మా నమ్మకం పవన్ అన్న స్టిక్కర్లను అంటించడం జనసేన నాయకులు చేస్తున్న నీచరాజకీయమని మండిపడ్డారు. వారికి చేతనైతే మరోలా రాజకీయం చేసుకోవాలే తప్ప ఇలాంటివి కాదని ఎద్దేవా చేశారు. ఆయన తిరుపతి 43వ డివిజన్‌లో కార్పొరేటర్ రాధయాదవ్, మురళీ యాదవ్, అధ్యక్షులు రాజ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

జగనన్న సంక్షేమ పాలనను ఆదరించండి

తిరుపతి రూరల్: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్న జగనన్న సంక్షేమ పాలనను ఆదరించాలని తిరుపతి రూరల్ మండలం జేసీఎస్ కన్వీనర్ కొత్తపాటి మునీశ్వర్ రెడ్డి కోరారు. ఆయన ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా వెంకటపతినగర్‌లో ఇంటి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాల గురించి వివరించారు. లబ్ధిదారుల సంతృప్తి మేరకు వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర రెడ్డి, సర్పంచ్ చిన్నియాదవ్, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, మూలం చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నకే పట్టం కడతాం

చంద్రగిరి: సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును గుర్తించుకుని మళ్లీ ఆయనకే పట్టం కడతామని ప్రజలు హోరెత్తించారు. మండలంలోని గంగుడుపల్లి, మండపంపల్లి, దోర్నకంబాల ప్రాంతాల్లో ఆదివారం గృహసారథులు, సచివాలయాల మండల కన్వీనర్ సీఎం.కేశవులు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల అనుమతితో నువ్వే మా భవిష్యత్ జగనన్న స్టిక్కర్లను అంటించి, సీఎం జగన్ నంబరుకు మిస్డ్ కాల్ ఇప్పించారు. సచివాలయాల మండల కన్వీనర్ సీఎం.కేశవులు మాట్లాడుతూ దేశంలోనే పేద ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, గురుమూర్తి యాదవ్, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, ధర్మారెడ్డి, సోని, ఈశ్వర్ రెడ్డి, బండి కృష్ణారెడ్డి, రూప సుందర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగిరెడ్డిపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సర్పంచి భారతి, ఉప సర్పంచి రోజా, సచివాలయ కన్వీనర్ లక్ష్మీపతి యాదవ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వెంకటపతినగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తున్న నాయకులు


జగనన్నే మా భవిష్యత్తు కరపత్రిక అందజేస్తున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

జోరుగా జగనన్నే మా నమ్మకం

భాకరాపేట : జగనన్నే మా నమ్మకం కార్యక్రమం చిన్నగొట్టిగల్లు మండలంలో జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ ఖదీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం చిన్నగొట్టిగల్లు, రంగన్నగారిగడ్డ, కొటబైలు, జంగావాండ్లపల్లె పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి అనుమతితో ఇంటికి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు రెడ్డెమ్మ, కిషోర్‌కుమార్‌రెడ్డి, మనోహర్, విమల, డివిజన్ పార్టీ అధ్యక్షుడు అక్బర్ పాల్గొన్నారు.

వారపు సంతలో చెవిరెడ్డి ఉచిత భోజనం


బోడేవాండ్లపల్లె వారపు సంతలో అల్పాహారం వడ్డిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- రైతులకు స్వయంగా వడ్డించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు అన్నం పెట్టడంలో సంతృప్తిగా ఉందని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లె వారపు సంతకు వచ్చిన రైతులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్నం పెట్టే రైతు వారపు సంతకు వచ్చి కూరగాయలు, పంటలను అమ్ముకునే క్రమంలో పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. వారికి ఒక పూట కడుపు నింపాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉచిత భోజనాన్ని అమలుచేస్తున్నారని తెలిపారు. ఈ వారపు సంత ఉదయం 11 గంటల వరకే ఉండడంతో అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యాంటీ టెర్రరిజం చైర్మన్ మణిందిర్ జిత్ సింగ్ బిట్టా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ చింత అనురాధ

తిరుమల: శ్రీవారిని ఆదివారం యాంటీ టెర్రరిజం చైర్మన్ మణిందిర్ జిత్ సింగ్ బిట్టా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ భరత్, ఎంపీలు చింత అనురాధ, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

చంద్రబాబుది పిచ్చిపార్టీ

ఆలయం వెలుపల డెప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబుది పిచ్చిపార్టీ అని, ఆయనతో ఉన్నవాళ్లంతా రాక్షస మనస్తత్వం కలిగిన వారని ధ్వజమెత్తారు. పేదలను ఆదరిస్తున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు ఇంటింటికీ ఉద్యోగం అన్నాడు అమలు చేశాడా..? అని ప్రశ్నించారు.

టెర్రరిజానికి చెక్

యాంటీ టెర్రరిజం చైర్మన్ మణిందిర్ జిత్ సింగ్ బిట్టా మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ పాలనలో టెర్రరిజానికి చెక్ పెట్టామన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు.

ప్రత్యేక హోదాపై ప్రశ్నిస్తూనే ఉన్నాం

అమలాపురం ఎంపీ చింత అనురాధ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నామన్నారు. సంబంధిత మంత్రులను కలిసి ప్రత్యేక హోదా ఇవ్వాలని విన్నవిస్తున్నట్టు వివరించారు. దీనిపై కేంద్ర మంత్రులు పునరాలోచిస్తున్నారని తెలిపారు. విభజన హామీల్లో రాష్ట్రానికి తీరని లోటు జరిగిందన్నారు. గత ప్రభుత్వం చేసిన కొన్ని తప్పిదాల వల్ల ప్రత్యేక హోదా రాలేదని చెప్పారు. గత ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ఒప్పుకోవడం వల్ల ప్రత్యేక హోదా రాకుండా పోయిందని తెలిపారు. ఇంకా ఏడాది కాలం ఉందని పెండింగులో ఉన్న ప్రాజెక్టులు అన్నీ పూర్తవుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లు సాధించడం ఖాయమని తెలిపారు. ఎన్నికలకు ఏడాది సమయం ఉందని, తాము కూడా సిద్ధంగానే ఉన్నామని తెలిపారు. మరో 40 మంది ఎమ్మెల్యేలు పార్టీ మార్పుపై మీడియాలో వచ్చే కథనాలు కల్పితాలు మాత్రమేనని కొట్టిపారేశారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10–11 గంటల మధ్య 0877–2227208 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలానే 11 నుంచి 12 గంటల వరకు నేరుగా అధికారులను కలిసి స్పందనలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ బివి.పాల్ రాజు

చంద్రగిరి: చంద్రగిరి సెయింట్ పాల్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో తిరుపతి జిల్లా క్రిస్టియన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు పాస్టర్ బి.వి.పాల్ రాజు మాట్లాడుతూ ఏసు క్రీస్తు సర్వ మానవాళి కోసం శిలువలో మరణించి మళ్లీ బతికిన రోజే ఈస్టర్ అన్నారు. ఏసయ్య పునరుత్థానపు శక్తి సకల ప్రజలకు అనుగ్రహించాలని కోరుతూ ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ శామ్, స్టీఫెన్, మోజెస్,రాజేష్ పాల్, ప్రశాంత్, ఆనంద్, మిల్కీ, సుధాకర్, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి ధనాశి ఉషారాణికి వరల్డ్ బుక్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ధనాశి ఉషారాణి

భాకరాపేట : భాకరాపేటకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, రచయిత్రి ధనాశి ఉషారాణి శ్రీశ్రీ వేదిక జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ నుంచి వరల్డ్ బుక్ అవార్డు అందుకున్నారు. ఆదివారం మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ తెలుగు బ్రహ్మోత్సవాల్లో ఈ అవార్డు ప్రదానం చేశారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దాం

తిరుపతి కల్చరల్: భారత కమ్యూనిస్ట్ పార్టీ అగ్ర నేత, భూపోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాధాకృష్ణ, శివ, పద్మనాభరెడ్డి, రాజా, రామకృష్ణ, రామచంద్రయ్య, నాగరాజు, బాబు, చలపతి, నాగభూషణం, శ్రీను, ప్రమీల, విజయమ్మ పాల్గొన్నారు.

క్రీమ్ స్టోన్ రెస్టారెంట్ ప్రారంభం


అభినయ్‌రెడ్డిని సత్కరిస్తున్న పారాస్‌జైన్, వాసవి మదన్

తిరుపతి తుడా: స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులోని హోటల్ జల్‌పాన్‌లో ఏర్పాటుచేసిన క్రీమ్ స్టోన్ రెస్టారెంట్‌ను ఆదివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రారంభించారు. వంటకాలను, ఐస్ క్రీమ్‌ను రుచి చూశారు. జల్‌పాన్ రెస్టారెంట్ ప్రొప్రైటర్ పారాస్ జైన్ మాట్లాడుతూ తమ రెస్టారెంట్‌లో స్వచ్ఛమైన వెజ్ వంటకాలను అందిస్తున్నామన్నారు. వాసవి మదన్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్కే బాబు


అనాథ శవాన్ని తీసుకెళుతున్న ఎస్కే బాబు తదితరులు

తిరుపతి తుడా: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్కే బాబు మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక లక్ష్మీపురం కూడలిలో ఫుట్‌పాత్‌పై ఒక మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్కే బాబు తన మిత్ర బృందంతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అనాథ శవానికి లక్ష్మీపురం కూడలిలోని శ్మశానవాటికలో హిందూ సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారం చేశారు. బాబు జగ్జీవన్‌రామ్ భవన్ అధ్యక్షుడు నల్లాని బాబు, ఉపాధ్యక్షుడు బచ్చన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ చెవిరెడ్డిని కలిసిన కమిషనర్ హరిత


ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలిసిన కమిషనర్ హరిత

తిరుపతి రూరల్/తిరుపతి తుడా : తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిత ఆదివారం ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తుమ్మలగుంటలోని ఆయన ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను అభినందించిన చెవిరెడ్డి, నగర అభివృద్ధికి మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆదివారం తిరుపతి, తిరుమల పర్యటనకు విచ్చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డిని, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీని కూడా కలిశారు.

16, 17, 18 తేదీల్లో ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 7వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.హరికృష్ణ తెలిపారు. వారు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సభల్లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 16వ తేదీన ఉదయం 10 గంటలకు లక్ష్మీపురం సర్కిల్ నుంచి భారీ కార్మిక ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం పద్మావతి పార్క్ వద్ద బహిరంగ సభ చేపడతామన్నారు. 17, 18వ తేదీల్లో ఎస్‌ఎస్‌బీ కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సత్యనారాయణశెట్టి


పామిడి సత్య నారాయణ శెట్టి

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ పాలక మండలి అధ్యక్షుడిగా పామిడి సత్యనారాయణశెట్టి నియమితులయ్యారు. తిరుపతి మహా నగర ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా గతంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడిగా పసుపర్తి గోపీనాథ్‌ని నియమించాయి. ఆయన అనారోగ్య కారణాల దృష్ట్యా పాలక మండలి సమావేశం నిర్వహించి పసుపర్తి గోపీనాథ్‌ను గౌరవాధ్యక్షుడిగా, ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న పామిడి సత్యనారాయణ శెట్టిని అధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయనను పలువురు ఆర్యవైశ్యులు అభినందించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఘనంగా వర్షితప్ సరిత జైన్ సత్కార వేడుకలు


సరిత బొహర జైన్‌ను ఊరేగిస్తున్న జైనులు

తిరుపతి కల్చరల్: జైనుల సుఖసంతోషాలను కాంక్షిస్తూ ఏడాది ఉపవాస దీక్ష చేపట్టిన వర్షితప్ సరిత బొహర జైన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. జైన్ మత వ్యవస్థాపకులు, జైనుల ఆరాధ్యులైన 24 మంది తీర్థంకుల్లో మొదటి వారైన రిషప్ భగవాన్ జైనుల పాప విమోచన కోసం చేపట్టిన వర్షితప్ పరంపర కొనసాగుతోంది. తిరుపతికి చెందిన జీతు జ్యువెలరి అధినేత జితేంద్ర అక్క సరిత బొహర జైన్ ఏడాది ఉపవాస దీక్షను పూర్తి చేసుకున్నారు. ఆమెను వారి కుటుంబ సభ్యులు ఆదివారం సత్కరించారు. కొత్తవీధిలోని జైన్ మందిరం నుంచి మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం జైన్ మందిరంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీతు జ్యువెలరి అధినేత జితేంద్ర, మహవీర్ జైన్, ప్రకాష్ జైన్, కుషల్ జైన్, జాన్‌చంద్‌జైన్, దేవేంద్రకుమార్, ప్రవీణ్, రాకేష్, రాజేందర్ బొహర, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, బెంగళూరు, తిరుపతి ప్రాంతాలకు చెందిన జైనులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు


పురవీధుల్లో దర్శనమిస్తున్న సీతారాములు


కోలాటాలు వేస్తున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని చిన్నఅంజిమేడులో ఆదివారం సీతారాముల ఊరేగింపు వైభవంగా జరిగింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా 10 రోజుల పాటు గ్రామస్తులు ఉభయదాతలుగా వ్యవహరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటానికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. విశేషాలంకరణ చేపట్టి కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాలతో సీతారాముల చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నేతాజీ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన రైల్వే స్టేషన్





వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్శనం అనంతరం స్వగ్రామాలకు వెళ్లేందుకు తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. భక్తుల రద్దీతో స్టేషన్ ఆవరణం కిటకిటలాడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సలాం.. వందే భారత్



వందే భారత్ రైలు ప్రయాణం ప్రయాణికులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ క్రమంలో ఆదివారం తిరుపతి నుంచి బయలుదేరిన వందే భారత్ రైలులో ఎక్కిన ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. కొంతమంది యువతీ, యువకులు తిరుపతి రైల్వే స్టేషన్‌లో సెల్ఫీ తీసుకుని మురిసిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


వందే భారత్ రైలులో మహిళా టీసీలు


అభివాదం


సెల్ఫీలు తీసుకుంటున్న యువతీ, యువకులు